జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 17 | మే | 2026 ◆ పేజీలు : 7




## మొక్కజొన్న నిల్వల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలి



**ఇల్లందు, మే 16, ప్రజాజ్యోతి:** కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న మొక్కజొన్న నిల్వలను గోడౌన్ లకు తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ అధికారులు, హమాలీలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున మొక్కజొన్న నిల్వలను త్వరితగతిన గోడౌన్ లకు తరలించాలని సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోవద్దని ఉద్దేశంతో యార్డులో పని చేసే హమాలీల సంఖ్యను పెంచాలని, రవాణా ప్రక్రియను అధిక వాహనాలను

మిగతా 2 లో...



# సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్ష

- ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులకు నిధుల మంజూరుకు ప్రణాళికలు : మంత్రి పొంగులేటి
- సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మే 16 (ప్రజాజ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, మరియు నిధుల మంజూరు తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాదులో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో నియోజకవర్గంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక సహకారంతో పినపాక నియోజకవర్గాన్ని సాగునీటి రంగంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని

మిగతా 2 లో...

## ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం...




- తరుగు పేరుతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు
- 167 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారుల నియామకం
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 16, (ప్రజాజ్యోతి)** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 167 కొనుగోలు కేంద్రాలకు 167 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించడంతో

మిగతా 2 లో...

## గంజాయి సేవించిన నలుగురు యువకులు గుర్తింపు

- పునరావాస కేంద్రానికి తరలించిన భద్రాచలం పోలీసులు





**భద్రాచలం, మే 16, ప్రజాజ్యోతి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, సరఫరా మరియు మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు

మిగతా 2 లో...

## ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

- జూన్ 24 నుంచి జులై 25 వరకు ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఇంటింటి సర్వే నిర్వహణ
- ఎస్ ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 16, (ప్రజాజ్యోతి )** జిల్లాలో జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ ఐఆర్) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ ఐఆర్ మ్యాపింగ్ పురోగతి, ఇంటింటి సర్వే ప్రక్రియపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి సంబంధిత అధికారులతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటరు

మిగతా 2 లో...

## మొక్కజొన్న నిల్వల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పాటు చేసి తరలించాలని సూచించారు. అవసరమైతే తాను కూడా మార్కెటింగ్ యార్డులోనే ఉంటానని, మరో రెండు మూడు రోజుల్లో యార్డులో ఉన్న మొక్కజొన్నలు గోడౌన్లలకు తరలించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడిఏ లాల్ చంద్, రెవెన్యూ, మార్క్ ఫెడ్ అధికారులు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, నాయకుడు దండుగుల శివ, హమాలీలు పాల్గొన్నారు.

## గంజాయి సేవించిన నలుగురు యువకులు గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు భద్రాచలం సీఐ నాగరాజు తెలిపారు.ఈ క్రమంలో శనివారం భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి టెస్టింగ్ కిట్ల సహాయంతో నిర్వహించిన తనిఖీల్లో నలుగురు యువకులు గంజాయి సేవించినట్లు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి, భద్రాచలం పట్టణంలోని దక్షత సొసైటీ జిల్లా మత్తు పదార్థాల వ్యసన పునరావాస కేంద్రం కు తరలించినట్లు తెలిపారు.ఇకపై భద్రాచలం పట్టణంలో మత్తు పదార్థాలు సేవించే వారిపై మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేస్తున్నా, విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువత తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసిన పోలీసులు, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం మరియు కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి...)

ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

### పులుసుబొంత ప్రాజెక్టు - కరకగూడెం మండలం :

కరకగూడెం మండల పరిధిలో ప్రతిపాదిత పులుసుబొంత ప్రాజెక్టు ద్వారా సుమారు 4,500 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే ఫారెస్ట్ క్లియరెన్స్‌కు (అటవీ శాఖ అనుమతులు) సంబంధించిన అన్ని అడ్డంకులను తొలగించేందుకు అధికారులతో చర్చించి వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారని తెలిపారు.

### రేగులగండి ప్రాజెక్టు – మణుగూరు మండలం :

మణుగూరు మండలంలోని రేగులగండి ప్రాజెక్టు ద్వారా సుమారు 2,000 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పనులు సజావుగా సాగుతున్నాయి. గతంలో ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తుచేస్తూ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారని చెప్పారు.

### మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం – అశ్వాపురం మండలం :

అశ్వాపురం మండల పరిధిలోని మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా సుమారు 16,000 ఎకరాలకు సాగు నీరు అందించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశారు. దాదాపు రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు ప్రస్తుతం అత్యంత వేగంగా జరుగుతున్నాయి. మే నెల చివరి నాటికి లేదా వచ్చే జూన్ నాటికి ఈ పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయిన వెంటనే 'రైట్ కెనాల్' కు నీటి విడుదల సాధ్యమవుతుంది. అయితే 'లెఫ్ట్ కెనాల్' పనులకు ఇంకా అదనపు నిధులు కావాల్సి ఉన్నందున, దానికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని మంత్రి పొంగిలేటి అధికారులను ఆదేశించారు.

### దోమలవాగు చెరువు మినీ రిజర్వాయర్ – బూర్గంపాడు మండలం :

బూర్గంపాడు మండలంలోని దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్ గా అభివృద్ధి చేయడం ద్వారా సుమారు 14,000 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించే అవకాశముంది. ఈ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం మరియు ములుగు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన ల్యాండ్ అక్విజిషన్, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు.

### అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు :

ఈ సమీక్షా సమావేశంలో పినపాక నియోజకవర్గ పరిధిలోని వివిధ ఎత్తిపోతల పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు మరియు తాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. ప్రజలకు, రైతులకు తక్షణ ప్రయోజనం చేకూరేలా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన నిధుల మంజూరు, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ముందడుగులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను పొంగిలేటి ఆదేశించారు. పినపాక నియోజకవర్గంలో సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసి ప్రతి రైతు ముఖంలో నవ్వులు పూయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారన్నారు.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్ ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15 నుంచి 22 వరకు ఇంటింటి సర్వే ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. జూన్ 24 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి వివరాలు నమోదు చేయాలన్నారు.ప్రజలకు తమ పరిధిలోని బీఎల్‌ఓల పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలు తెలిసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రముఖుల పేర్లు ఓటరు జాబితాలో లేకపోవడం వంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.ఫారం–6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ అయిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలని తెలిపారు. అదేవిధంగాప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ సమావేశాల మినిట్స్ ను భద్రపరచాలని సూచించారు. ఎస్ ఐఆర్ కార్యక్రమంపై బూత్ లెవల్ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఐటీ బృందానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని, బీఎల్‌ఓలు మొబైల్ యాప్ ను తప్పనిసరిగా డౌన్ లోడ్ చేసుకొని వినియోగించాలని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు 17 వేల మ్యాపింగ్ పూర్తి చేశామని వెల్లడించారు. జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. బీఎల్‌ఓలకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందిస్తూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తామని అన్నారు .ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం...

(మొదటి పేజీ తరువాయి...)

పాటు కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో తాగు నీరు, తార్పాలిన్లు, తూకం యంత్రాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.రైతులు తీసుకువచ్చే ధాన్యం, మొక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి వెంటనే నిల్వ కేంద్రాలకు తరలించే విధంగా సమన్వయ చర్యలు చేపట్టామని తెలిపారు.జిల్లాలో మొత్తం 94,198 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగగా, సుమారు 2,44,915 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేయబడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్ కు రూ.2,400 చొప్పున రైతులకు అందిస్తున్నామని , జిల్లాకు సంబంధించి 94,822 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 32,546.350 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.కొనుగోలు చేసిన మొక్కజొన్నలో 19,595.350 మెట్రిక్ టన్నులను ఇప్పటికే గోదాములకు తరలించామని, మిగిలిన 12,951 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా త్వరితగతిన తరలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా అవసరమైన రవాణా సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటూ నిరంతర లోడింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా 6,50,927 గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. మొక్కజొన్న నిల్వ కోసం జిల్లాలోని కొదాడ, బాదలాపురం, మత్తంపల్లి, కుక్కడాం, కరేపల్లి, యెల్లందు, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి తదితర ప్రాంతాల్లోని శాస్త్రీయ గోదాములను గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 41,814 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాముల్లో ప్రస్తుతం 19,622 మెట్రిక్ టన్నుల స్థలం వినియోగంలో ఉండగా, ఇంకా 22,192 మెట్రిక్ టన్నుల ఖాళీ నిల్వ స్థలం అందుబాటులో ఉందన్నారు.ధాన్యం తేమ శాతం, తరుగు తదితర అంశాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా రైస్ మిల్లర్లు తరుగు పేరుతో అనవసర కోతలు విధించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ఎటువంటి రాజీ ఉండదని తెలిపారు.ఈ ఏడాది జిల్లాలో అధిక స్థాయిలో ధాన్యం దిగుబడి నమోదవుతున్న నేపథ్యంలో నిల్వల కోసం ప్రత్యామ్నాయ స్థలాలను కూడా ప్రత్యేకంగా గుర్తించి సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న ఫంక్షన్ హాళ్లు, గోదాములు, పాఠశాల భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగిస్తూ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు .రైతులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత ప్రత్యేక అధికారులకు లేదా జిల్లా అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఆరుగాలంశ్రమించి పండించిన రైతుల పంటను ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

# నిరుపేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం





**ఇల్లందు, మే 16, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని, రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఉండడానికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని, నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లను పూర్తి నాణ్యతతో లబ్ధిదారులు దగ్గరుండి పనులను పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, 20 వార్డు కౌన్సిలర్ ఎండి జాఫర్, మాజీ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్ కుమార్ పాసి, మాదాసు సుమన్, ఆలేటి చిన్ని, పోట్ల శ్రీను, కోలపురి ఝాన్సీ, తోకల అశోక్, దోరేపల్లి మమత, రాజు, బమాండ్ల రమేష్, శ్రీకాంత్, నాయిని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాలగాని



**ఇల్లందు, మే 16, ప్రజాజ్యోతి:** బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడిగా బిజెపి ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ బాలగాని గోపికృష్ణ గౌడ్ ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నియమించారు. శనివారం బాలగాని గోపికృష్ణ గౌడ్ మాట్లాడుతూ గతంలో బిజెపి పార్టీ నిర్ణయం మేరకు ప్రతి ఒక్క కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో తన వంతు పాత్ర పోషించానని తెలిపారు. అదేవిధంగా రానున్న ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సహకరించిన పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన

- ఎర్రగుంటలో ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాల నిర్వహణ




**అన్నపురెడ్డిపల్లి, మే 16, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. కమ్యూనిటీ ఆరోగ్య అధికారి వాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ప్రజలకు డెంగ్యూపై అవగాహన కల్పించారు. “తనిఖీ చేయండి.. శుభ్రపరచండి.. మూసి ఉంచండి” అనే నినాదంతో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పాత టైర్లు, కూలర్లు, డబ్బాలు వంటి వాటిలో దోమలు పెరగకుండా చూడాలని తెలిపారు. డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు.గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరిస్తేనే డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రజలు వారానికి ఒకరోజు డ్రై డేగా పాటించి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వెంకటేశ్వరావు, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాశరావు, నర్సింగ్ అధికారి సత్యవతి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16 టైర్ల లారీలతో 12, 14 బండ్ల లారీలకు తీవ్ర అన్యాయం

- లారీ ఓనర్ గడ్డి మందు తాగుతుండగా అడ్డుకున్న పోలీసులు







**టేకులపల్లి,మే 16, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితల గని నుండి నవభరత్, బీపీఎల్ కు బొగ్గు రవాణా చేస్తున్న 12, 14 టైర్ల లారీ ఓనర్లు 16 టైర్ల లారీల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని లారీ ఓనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లి మండలంలోని చుక్కలబోడు సమీపంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం 12, 14 టైర్ల లారీల ఓనర్లు లారీలను నిలిపి నిరసన వ్యక్తం చేయబోతుండగా టేకులపల్లి ఎస్సై ఏ.రాజేందర్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాగా లారీ ఓనర్ గుగులోతు రవి ఒక్కసారిగా పురుగుల మందు తాగుబోతుండగా అడ్డుకునే క్రమంలో టేకులపల్లి ఎస్సై, లారీ ఓనర్ పై పురుగుల మందు పడింది. ఈ సందర్భంగా లారీ ఓనర్లు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే 12, 14 టైర్ల లారీలను మాత్రమే నవభరత్, బీపీఎల్ కు వెళ్లే విధంగా చూడాలన్నారు. 16 టైర్ల బండ్లు వస్తే ఎక్కువ టన్నుల బొగ్గు వారికి లోడ్ అవుతుందని, తద్వారా తమకు తీవ్ర అన్యాయం జరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల లారీల ద్వారా నవభరత్, బిపిఎల్ కు బోగ్గు లోడ్ ఇస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, లారీలకు ఈఎంఐ కట్టే పరిస్థితి కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల బండ్లను ఇల్లెందుకు చెందిన చిట్టి బాబు కాంట్రాక్టర్ తీసుకురావడంతో తమకు అన్యాయం జరుతుందని ఆరోపించారు. చిన్న బండ్ల లారీల ఓనర్లకు ఉరితాడు అవుతుందని, కుటుంబాలు ఇబ్బందుల పాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే లారీలను నడిపి తమకు న్యాయం చేయాలని చేయాలని కోరారు.

## ఇల్లందు సబ్ జైలు ను సందర్శించిన జడ్జి



**ఇల్లందు, మే 16, ప్రజాజ్యోతి:** ఇల్లందు సబ్ జైలు ను శనివారం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం సందర్శించారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ పరిసరాలను పరిశీలించి, పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో సబ్ జైల్ లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తిక్, సబ్ జైల్ సూపరిండెంట్ చంద్రశేఖర్, జైలు సిబ్బంది, సాంబ, శాంతి స్వరూప్, భాస్కర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ

**చర్ల, మే 16: (ప్రజాజ్యోతి)** జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం డెంగ్యూ నివారణపై విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్యనారాయణపురం వైద్యాధికారి డాక్టర్ దివ్యనయన ప్రారంభించి ప్రజలకు డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరాన్ని వివరించారు.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని డెంగ్యూ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కూలర్లు, నీటి డబ్బాలు వంటి వాటిలో దోమలు పెరగకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు.డెంగ్యూ వ్యాధి సోకకుండా ఉండేందుకు దోమ తెరలు వినియోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. జాగ్రత్తలతో డెంగ్యూ వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ దివ్యనయన పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## టూబిట్స్ క్రికెట్‌టోర్నమెంటును ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకులు



**భద్రాచలం టౌన్, మే 16, ప్రజాజ్యోతి** భద్రాచలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన టు బిట్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, యువకులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, కొలిపాక శివసాయి పాల్గొన్నారు.

# పేరు ప్రతిపాదనకు ఏకగ్రీవ వ్యతిరేకం

- ప్రజలతో ఏకీభవించిన గ్రామపంచాయతీ పాలకవర్గం
- మార్కెట్ పేరు ప్రతిపాదనను నిలిపివేస్తూ ఏకగ్రీవ తీర్మానం




**భద్రాచలం టౌన్, మే 16 ప్రజాజ్యోతి** భద్రాచలంలో నూతన మార్కెట్ కి భీమపాక భూపతి రావు పేరు పెట్టాలని పంచాయతీ కార్యదర్శి చేసిన ప్రతిపాదనను గ్రామసభ ఏకగ్రీవంగా వ్యతిరేకించింది. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పూణేం కృష్ణ అధ్యక్షతన కార్యదర్శి శ్రీనివాసరావు గ్రామసభను నిర్వహించారు. తొలుత గ్రామసభలో అధికారులు పట్టణంలోని నూతన చికెన్ మార్కెట్ కి పాలేరు మాజీ శాసనసభ్యులు భీమపాక భూపతి రావు పేరును పెట్టాలని అధికారుల ఆదేశాలతో గ్రామసభను నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రతిపాదనపైన ఎవరికైనా ఇటువంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ ప్రతిపాదనపై గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడిన అనంతరం పాలకవర్గ సభ్యులు బండారు శరత్‌బాబు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గం మూడుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా కుంజా బుజ్జి సేవలందించారని, సున్నం రాజయ్య మూడు పర్యాయాలు శాసన సభ్యులుగా పని చేశారని, ముర్ల ఎరయ్యరెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా, సోండె రామయ్య, కుంజా సత్యవతి సైతం ఎస్టీ నియోజకవర్గమైన భద్రాచలంలో తమ సేవలను అందించారని గుర్తు చేశారు. అటువంటి ఆదివాసి ప్రజా ప్రతినిధులను విస్మరించి స్థానికేతర ప్రజాప్రతినిధి పేరు ప్రతిపాదించడం సరైనది కాదని దీనిని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే 20వ వార్డు సభ్యురాలు ఇర్పా అనసూయ, ఆదివాసి సంఘాల నాయకులైన ముర్ల రమేష్ పూణెం ప్రదీప్ పట్టణ ప్రముఖులు షేక్ అజీమ్ లు గ్రామ సభలో మాట్లాడుతూ ఐదో షెడ్యూల్లో ఉన్న భద్రాచలం నియోజవర్గంలో ఆదివాసి ప్రజా ప్రతినిధులు ఎన్నో త్యాగాలు చేసి సేవలందించారని గుర్తు చేశారు. అటువంటి ఆదివాసి ప్రజాప్రతిథులను వదిలేసి గిరిజనేతర ప్రజాప్రతినిధుల పేర్లు పెట్ట డం సరింది కాదని అసలు ఇటువంటి తీర్మానాల కోసం గ్రామసభ పెట్టాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ఉన్నత అధికారులు ఆదేశాలతో కూరగాయల మార్కెట్ కి బీమాపాక భూపతి రావు పేరు పెట్టేందుకు గ్రామ సభలో తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. ఈ తీర్మానాన్ని వ్యతిరేకించే వాళ్ళు చేతులెత్తాలని కోరగా గ్రామసభకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆదివాసి సంఘ నాయకులు దళిత సంఘం నాయకులు వివిధ రాజకీయ పక్ష నేతలు చేతులెత్తి తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఈ ప్రతిపాదనను మే ము సైతం వ్యతిరేకిస్తున్నామని వేదిక ను అలంకరించిన పాలకవర్గ సభ్యులు సర్పంచ్ కూడా చేతులెత్తి ప్రజాభిష్టానంతోనే పాలకవర్గం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. నూతన మార్కెట్ కి భూపతిరావు పేరు ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నట్లు పం చాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

## సీతారత్నం మృతదేహం వద్ద నివాళ్లర్పించిన ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్



**భద్రాచలం టౌన్, మే 16 ప్రజాజ్యోతి** భద్రాచలంలో తొలితరం ఉద్యమకారులు నూకపేయి నరసింహమూర్తి సతీమణి సీతారత్నం మృతి చెందడంతో ఆమె మృతదేహం వద్ద శనివారం ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్ నివాళ్లర్పించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన రవీందర్ మృతి చెందిన విషయం తెలుసుకొని మృతదేహం వద్ద నివాళ్లర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కోటగిరి ప్రబోద్‌కుమార్, కొండముక్కల సాయిబాబు, రాజేంద్రవర్దన్, బి. అప్పారావు, రావులపాటి పృద్వీ పాల్గొన్నారు.

## చేతి పంపుకు అక్రమ మోటార్

- ఉప్పరిగూడెంలో త్రాగునీటి కష్టాలు



**చర్ల, మే 16 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ప్రభుత్వ చేతి పంపుకు అక్రమంగా విద్యుత్ మోటార్ బిగించడంతో గ్రామ ప్రజలు తీవ్ర త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇంటి ముందు ఉన్న ప్రభుత్వ చేతి పంపుకు సబ్‌మర్సిబుల్ మోటార్ ఏర్పాటు చేసి నీటిని అధికంగా వినియోగిస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలకు నీరు అందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో సుమారు 25 కుటుంబాలు ఈ చేతి పంపుపైనే ఆధారపడి తమ త్రాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నాయి. అయితే చేతి పంపుకు రంధ్రం చేసి మోటార్ బిగించడంతో నీటి మట్టం తగ్గిపోయి మిగతా కుటుంబాలకు నీరు అందని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటుతున్న సమయంలో మోటార్ ద్వారా నీటిని అధికంగా తోడేస్తుండటంతో ప్రజలకు చుక్కనీరు కూడా దొరకడం లేదని వారు తెలిపారు. దీంతో కొందరు గ్రామస్తులు త్రాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై పంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకుని చేతి పంపుకు బిగించిన మోటార్‌ను తొలగించి గ్రామ ప్రజలకు త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్



**భద్రాచలం టౌన్, మే 16, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శనివారం మహబూబాద్ ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని, దాసాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రవీందర్‌కు ఆలయ వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం తరపున శాలువతో సత్కరించి తీర్ద ప్రసాదాలను ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు. అదేవిధంగా తాతగుడి సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో సైతం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోటగిరి ప్రబోద్‌కుమార్ ఇంట్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, కోటగిరి ప్రబోద్‌కుమార్, రేపాక పూర్ణ, ప్రేమ్‌కుమార్, నర్సింహారావు, న్యాయవాది పాపినేని రామాంస పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు భద్రగిరి మార్‌ట్ సరుకులు అందజేసిన ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం టౌన్, మే 16 ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రగిరిమార్‌ట్‌లోని సేంద్రియ, పోషకాహారంకు సంబంధించిన నిత్యవసర సరుకులను శనివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మర్యాద పూర్వకంగా కలిసి అందజేశారు. హైదరాబాదులోని సచివాలయంలో ఇతర మం త్రివర్యులతో కలిసి మహువ ఫ్లవర్ ప్రాజెక్‌ట్ అమలుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వర్క్ షాప్ లో పాల్గొన్న తెలంగాణలోని ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఐటీడీఏ పరిధిలోని ప్రతి గిరిజన గ్రామంలో ఇప్పపువ్వు సేకరణ నిలువ యూనిట్ల కోసం తీసుకోవలసిన కార్యాచరణ గురించి నిర్వహించిన వర్క్ షాపులో భద్రాచలం ఐటీడీఏ తరపున పాల్గొనడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 70 ఎస్ఎస్సి గ్రూపు మహిళలు, ఆదివాసి గిరిజన మహిళలు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని తయారుచేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్లు, వివిధ రకాల పచ్చళ్ళు, తృణధాన్యాలు, గిరిజన రైతుల నుండి సేకరిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ మరియు భద్రగిరి మార్‌ట్ కు సంబంధించిన నిత్యవసర సరుకులతో పాటు బుక్లెట్ ను మంత్రివర్యులకు అందించి భద్రగిరి మార్‌ట్ నిర్వహణ గురించి పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షే మ శాఖ మంత్రివర్యులు మాట్లాడుతూ అడవులలో నివసించే ఆదివాసి గిరిజన మహిళలు, రైతులు, ఎస్సిహెచ్‌జి గ్రూప్ మహిళలు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకొని మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న వాస్తవాలను గమనించి వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి భద్రాచలంలో భద్రగిరి మార్‌ట్ నెలకొల్పి వారు తయారు చేసిన నిత్యవసర సరుకులను మధ్య దళారుల పాలు కాకుండా కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా వెసులుబాటు కల్పించిన ఐటీడీఏ పీవో బి రాహుల్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన గురుకులాల ఇంటర్ ప్రవేశాలకు కౌన్సిలింగ్

- సీట్లు కేటాయించిన రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి

**భద్రాచలం టౌన్, మే 16, ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ బాలుర మొదటి సంవత్సరం ప్రవేశాలకు పకడ్బందీగా కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయింపు నిర్వహించినట్లు రీజినల్ కోఆర్డినేటర్ ఖమ్మం రీజియన్ శ్రీమతి బి అరుణ కుమారి అన్నారు. శనివారం నాడు భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలోమొత్తం 539 సీట్ల గాను బాలుర కౌన్సిలింగ్ 480 మందికి వివిధ కళాశాలలో తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కళాశాల కృష్ణ సాగర్, తెలంగాణ గిరిజన గురుకుల బాలురు కళాశాల కిన్నెరసాని, తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కళాశాల దమ్మపేట, తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కళాశాల గుండాల, తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కళాశాల సింగరేణి, తెలంగాణ గిరిజన గురుకుల బాలురు కళాశాల తిరుమలాయపాలెం, ఆరు కళాశాలలో బాలురను కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో వివిధ కళాశాలకు సంబంధించిన ప్రిన్సిపాల్సు బి ఎల్ రాయణరావు, జి హరికృష్ణ, భాస్కర్, ఎం దేవదాస్, రమేష్, సీతారామ నాయక్ మరియు భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, స్కూల్ ప్రిన్సిపాల్, హేమలత పాల్గొన్నారు వివిధ కళాశాలకు సంబంధించినటువంటి లెక్చరర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బీటీపీఎస్ బూడిదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

- **మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర**



**పినపాక,మే 16(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక–మణుగూరు మండలాల మధ్య నిర్మించిన బీటీపీఎస్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిద కారణంగా పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. పినపాక మండలం సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీటీపీఎస్ ప్లాంట్‌ను కాలం చెల్లిన పాత పద్ధతుల్లో నిర్వహించడం వల్ల వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్లాంట్ నుంచి వచ్చే బూడిద గ్రామాలపై కురుస్తుండటంతో ప్రజలు శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఉదయం సమయంలో గ్రామాలన్నీ బూడిదతో కప్పుకుపోతుండటంతో ప్రజలు బయటకు రావడానికే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.చెరువులు, కాలువలు బూడిదతో నిండిపోవడంతో ఆ నీరు వ్యవసాయానికి పనికిరాకుండా పోతోందని, దీని వల్ల రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు సరిగా పండక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ బీటీపీఎస్ అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల బాధలను గమనించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీటీపీఎస్ నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను స్థానిక గ్రామాల అభివృద్ధికి వినియోగించడం లేదని ఆరోపించారు. కనీసం రోడ్ల వెంట మొక్కలు నాటడం, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడం వంటి పనులు కూడా చేయడం లేదని విమర్శించారు.బీటీపీఎస్ ప్లాంట్ కారణంగా ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, వాతావరణంలో తేమ శాతం తగ్గిపోతుందని అన్నారు. కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని, ఇంకా ఎంతమంది ప్రాణాలు పోతే ప్రభుత్వం స్పందిస్తుందని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే గ్రామాల వారీగా కొత్త కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్లాంట్‌ను మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో స్థానిక గ్రామస్తులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ సైనికులు భాస్కర్ రెడ్డి, మనిధర్, కుందూరు, మురళి, అభ్యుదయ సంఘం మండల అధ్యక్షులు శ్రీను, పాల్గొన్నారు.

# దోమల నివారణతో డెంగ్యూ దూరం

- **మోరీల్లో, డ్రైనేజీల్లో చెత్త వేయడం నేరం**
- **డ్రైనేజీలు,మోరీలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యం**
- **ఆరోగ్యశాఖ జిల్లా వైద్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్**




**టేకులపల్లి,మే16,ప్రజాజ్యోతి:** దోమల నివారణతో వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ జ్వరాలకు దూరం కావచ్చని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆరోగ్యశాఖ జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం అన్నారు.శనివారం సులనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మే 16వ తేదీ ప్రపంచ డెంగ్యూ దినోత్సవాన్ని డాక్టర్ రామదాసు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ మనోహనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్య జిల్లా వైద్య అధికారి డాక్టర్ తుకారాం పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మానవ మరణాలు అత్యంత చిన్న కీటకమైన దోమకాటుతో సంభవిస్తున్నాయని ఆయన తెలిపారు. అత్యంత బాధాకరమైన విషయమని, ఇంటి పరిసరాలలో ఎటువంటి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి అని అన్నారు.ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే విధిగా పాటిస్తూ దోమ పుట్టకుండా, దోమ కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరి మీద ఉందని ఆయన అన్నారు. గ్రామాల్లోని డ్రైనేజీల్లో, మోరీల్లో ప్రజలు నిర్లక్ష్యంగా చెత్తాచెదారం వేయడంతో మురుగు నీరు సక్రమంగా ప్రవహించకుండా నీటి నిల్వలు పేరుకొనిపోయి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. మురుగునీరు ప్రవహించే కాలువల్లో మోరీలో చెత్త వేయడం ప్రజా ఆరోగ్య రక్షణ చట్టంలో నేరపూరితమైన చర్య అని అన్నారు. దయచేసి ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు అలాగే నీటి ట్యాంకులు డబ్బాలు మూతలతో మూసి ఉంచాలని అన్నారు.రాత్రి పూట దోమతెరలు వినియోగించాలని,గృహాలకు దోమ జాలీలు అమర్చుకోవాలని అన్నారు. నిండుగా బట్టలు ధరించాలని అన్నారు.దోమల నివారణ కోసం అన్ని రకాల చిట్కాలు ఉపయోగించాలి. దోమకాటుతో వచ్చే డెంగీ, మలేరియా,బోధకాలు మెదడు వాపు వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని అన్నారు.డెంగ్యూ లక్షణాలైనా విపరీతమైనజ్వరం, తలనొప్పి,చలి, వణుకు, ఒళ్లు నొప్పులు, వాంతులు, అలసట ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని తగిన చికిత్స తీసుకోవాలని కోరారు. మన సంకల్పం –డెంగీ రహిత భారత్ అని, మన చర్యలు, మన రక్షణ ఆరోగ్యకరమైన కుటుంబం – సురక్షితమైన సమాజం అని అన్నారు. డెంగీ రా కుండా ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని డెంగీ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేశ్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ కుమారస్వామి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సీసీ రాంప్రసాద్,డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్య, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సబ్ యూనిట్ ఆఫీసర్ జాబిశెట్టి శ్రీనివాస్, సూపర్వైజర్లు గుజ్జా విజయ కౌసల్య సింగ్, నాగుబండివెంకటేశ్వర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు హారిక, ధరణి, రుక్సానా, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, దనసరి రాంబాబు, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి

- **పాల్వంచ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్**




**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** రోగులకు అవసరమైన ఔషధాల విక్రయంలో అమలవుతున్న ఈ–ఫార్మసీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పాల్వంచ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.శనివారం స్థానిక జే పార్క్ హోటల్‌లో దేశవ్యాప్త బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఫార్మా రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఎన్నో విజ్ఞప్తులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.ఈ–ఫార్మసీ విక్రయాల వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను అడ్డుపెట్టుకొని నకిలీ ప్రిస్క్రిప్షన్లతో మందులు విక్రయించడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని హెచ్చరించారు. ఈ వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.కోవిడ్ సమయంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా ఈ–ఫార్మసీ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్పొరేట్ సంస్థలు అమలు చేస్తున్న అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు కొత్త విధానాన్ని తీసుకురావాలని కోరారు.అసోసియేషన్ కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణాచారి మాట్లాడుతూ మందుల దుకాణాల యజమానుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న బంద్‌లో భాగంగా పాల్వంచలో కూడా మెడికల్ షాపులను బంద్ చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో కేంద్రం పూర్తిగా విఫలం

- **సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో భారీ ధర్నా**




**కొత్తగూడెం, మే 16 ( ప్రజాజ్యోతి )** దేశంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సలిగంటి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య విమర్శించారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతోందన్నారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో మాత్రం చమురు సంస్థల కార్పొరేట్ దోపిడీ కొనసాగుతోందని ఆరోపించారు. ఇంధన ఉత్పత్తులను వెంటనే జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరలను తగ్గించి గతంలో ఉన్న సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. పేద ప్రజలను ఆదుకునేందుకు రేషన్ దుకాణాల ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించకపోతే ధరల పెంపుకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యుడు నేరెళ్ల రమేష్, నాయకులు మాచర్ల శ్రీనివాస్, ఎండి యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, గుమ్మడెల్లి దుర్గయ్య, ఖయూమ్, లక్ష్మీనారాయణ, ధన్రాజ్, ఇర్ఫాన్, జహీర్, షాహీన్, రసూల్, బడుగు భాస్కర్, ఆరేల్లి కృష్ణ, అజయ్, బాబు జానీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యుడిపై భారాల మోత

- **కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం**
- **ధరలు తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని హెచ్చరిక**



**కొత్తగూడెం, మే 16 (ప్రజాజ్యోతి )** పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరింత భారాలు మోపుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యిన వెంటనే ప్రజలపై ధరల పిడుగులు కురిపించడం మోడీ ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. కొత్తగూడెంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయంగా ఇరాన్–అమెరికా ఉద్రిక్తతలను సాకుగా చూపుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను భారీగా పెంచడం ప్రజలను ఆర్థికంగా కుదేలు చేసే చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం మోపడం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని రకాల వస్తువుల ధరలు అమాంతం పెరిగే ప్రమాదం ఉందని దేవి ప్రసన్న ఆందోళన వ్యక్తం చేశారు. వంటగ్యాస్ ధరల పెంపుతో గృహిణులపై అదనపు భారం పడుతోందని ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకూ తగ్గిపోతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రజాగ్రహాన్ని కేంద్ర ప్రభుత్వానికి చవిచూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వై. శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, చిమట నాగేశ్వరరావు, కుమారస్వామి, మెట్టెల సైదుబాబు, దామెర్ల సర్వయ్య, రాము, మహేష్, సంపత్, మతిన్, భూక్య రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లో చేరిన ఖాజా భక్ష్

- మైనారిటీలకు కాంగ్రెస్‌లో గౌరవం లేదని వ్యాఖ్య



**కొత్తగూడెం, మే 16 ( ప్రజాజ్యోతి )**కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీలో మైనారిటీలకు సరైన ప్రాధాన్యత లేదని మాజీ కాంగ్రెస్ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఖాజా భక్ష్ విమర్శించారు. ఈ కారణంగానే ఇటీవల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. శుక్రవారం రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఖాజా భక్ష్ మాట్లాడుతూ మైనార్టీలకు గౌరవం, గుర్తింపు బీఆర్ఎస్ పార్టీలోనే లభిస్తోందన్నారు. త్వరలో తనతో ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేర్పిస్తామని తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేంద్రరావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలి

- బిఆర్ఎస్ పార్టీ నాయకులు చీమల సత్యనారాయణ డిమాండ్



**టేకులపల్లి,మే16,ప్రజాజ్యోతి:**మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని ఇల్లందు నియోజవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చీమల సత్యనారాయణ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన 24 గంటల వ్యవధిలో పోలీసులు అదుపులోకి తీసుకోవాల్సి ఉండగా, సిట్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసును నీరు కారుస్తుందని ఆయన ఆరోపించారు. రాజకీయ నాయకులకు ఒక రూల్, పేద ప్రజలకైతే ఒకరోజు ఉంటుందా..? సమానత్వంలో ఏకత్వం అనే భారతదేశంలో ఉన్న మనం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకిలా చేస్తుందో అని అర్థం కావట్లేదు ఆయన అన్నారు. రాష్ట్ర హోంమంత్రి పదవిని రేవంత్ రెడ్డి లో పెట్టుకొని ఇలా వ్యవహరించడం సభ్య సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ధనికుడికి, ప్రజాప్రతినిధులకు ఇలాంటి కేసుల లో శిక్ష పడితే న్యాయస్థానాలపై, పోలీసు వ్యవస్థపై పేదలకు ఎనలేని నమ్మకం కలుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్ళు తెరిచి బండి భగీరద్ ను కోర్టులో హాజరు పరిచి నిండితుడి శిక్ష పడేలా చేస్తే, అలాంటి తప్పు చేయాలంటే ప్రతి ఒక్కరు భయపడతారని తెలిపారు.

## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌కు ఎంపికైన చిన్నారులను సత్కరించిన డీఎస్పీ సతీష్

**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ –2026లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ 2వ డివిజన్‌కు చెందిన బొమ్మ రోజస, తాన్వి చిన్నారులను డీఎస్పీ సతీష్ అభినందించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ఇద్దరు చిన్నారులు జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.క్రీడల్లో రాణించడంతో పాటు విద్యలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్పీ సతీష్ సూచించారు. చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, కోచ్ రాంబాబును అభినందించారు.



## శ్రీ షిర్డీ సాయిబాబా భజన మందిరంలో ఘనంగా ప్రత్యేక పూజలు



**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** పాతపాల్వంచలోని ప్రసిద్ధ శ్రీ షిర్డీ సాయిబాబా భజన మందిరంలో 13వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పంచామృతాభిషేకాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.ఆలయ ప్రధానార్చకులు చిలుకూరి దినకరశాస్త్రి ఆధ్వర్యంలో, దేవాలయ వ్యవస్థాపకులు ముత్యాల కోటేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకులు ముత్యాల కోటేశ్వరరావు, కట్టా శ్రీను, పాశం నాసరయ్య, కట్టా నర్సింహారావు, వెంకట కృష్ణ, గూడపాటి నాగేశ్వరరావు, ఉపశ్రీ, కృష్ణవేణి, జయలక్ష్మి, మాచవరపు లక్ష్మి, రాఘవమ్మ, కృష్ణకుమారి, మధురవాణి, సామ్రాజ్యం, విజయ రాణి, స్వరూపరాణి, వరలక్ష్మి, పద్మ తదితర భక్తులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం: సీపీఐ




**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపి నడ్డి విరుస్తోందని సీపీఐ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం పాల్వంచలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ధరలు పెంచబోమని హామీలు ఇచ్చి, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచుతూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పుడు మాత్రమే ధరలు పెంచుతున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఎందుకు ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చిన్న టిఫిన్ సెంటర్లు, హోటళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు చమురు ధరల పెంపుతో రవాణా రంగంపై అదనపు భారం పడటమే కాకుండా నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికులు కనీస వేతనాలు కూడా పొందలేని పరిస్థితుల్లో ధరల పెరుగుదల వారి జీవనాన్ని మరింత కష్టాల్లోకి నెడుతోందన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలే ప్రజలను రక్షిస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వీ. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఎస్ఏ రెహమాన్, ఎస్కే గౌస్, హైమద్ జానీ, కరీం, నామ పండు, కాకటి రవీందర్, ప్రేమచంద్, రామాచారి, కృష్ణ, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, లక్ష్మీ, విజయ, పద్మ, హెచ్. వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఫోన్‌పే ద్వారా రూ.5 వేలు జమ చేసినట్లు చూపి కిరాణ వ్యాపారిని మోసగించిన వ్యక్తులు

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**భద్రాచలం టౌన్, మే 16 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని పాత కూరగాయల మార్కెట్‌లో ఓ కిరాణ వ్యాపారిని నకిలీ ఫోన్ పేలో రూ.5 వేలు కొట్టినట్లు చూపించి మోసగించి కిరాణ సరుకులతో ఉడాయించిన సంఘటన ఇది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం కొంజర్ల రమేష్ అనే కిరాణ వ్యాపారి వద్ద ఇద్దరు వ్యక్తులకు వచ్చి రూ.5 వేలు విలువైన సరుకులు తీసుకున్నారు. అనంతరం ఫోన్ పే చేస్తామని చెప్పి చేసినట్లుగా చూపించారు. షాపులో రద్దీగా ఉండటంతో ఫోన్‌పే చేసినట్లు చూపించగా వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తరువాత కొంజర్ల రమేష్ ఫోన్లో పరిశీలించగా రూ.5 వేలు వచ్చినట్లు చూపించడం లేదు. ఆందోళన చెందిన రమేష్ సీసీ కెమెరాలో వారి కదలికలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో భద్రాచలం పోలీసులు జరిగిన సంఘటనపై ఆరా తీయడంతో పాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడుని సన్మానం ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి,మే16,ప్రజాజ్యోతి:** టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూతనంగా నియమితులైన లక్కినేని శ్యామ్ బాబును ఎమ్మెల్యే కోరం కనకయ్య శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. శనివారం కోయగూడెం ఎమ్మెల్యే నివాసంలో టేకులపల్లి మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసంతో పని చేసి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి నాయకులతో మమేకమై పార్టీని మరింత బలం చేకూర్చాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవికి గద్దల రమేష్ దరఖాస్తు



**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవికి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ శనివారం దరఖాస్తు సమర్పించారు. కొత్తగూడెం డీసీసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్జర్వర్ వెంకట నరసయ్యకు ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా పార్టీని నమ్ముకొని పనిచేసిన కార్యకర్తలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. పాల్వంచ మండల అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపుకు కట్టుబడి అనేక కార్యక్రమాలను విజయవంతం చేశానన్నారు.పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను గ్రామ గ్రామానికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షుడు పోదేం వీరయ్య తనను పాల్వంచ సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమించారని చెప్పారు. ఎడపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మండల పరిధిలో 15 వేల సభ్యత్వాలను నమోదు చేయడం జరిగిందన్నారు.పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఏకైక సర్పంచ్ తానేనని గద్దల రమేష్ పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి సేవలు చేసిన తనకు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ పాల్గొన్నారు.

**డిజిటల్ చెల్లింపుల యుగం ఎంత వేగంగా ముందుకు సాగుతున్నా.. సామాన్య ప్రజల దైనందిన జీవితంలో మాత్రం ఇప్పటికీ 'చిల్లర'కే అసలైన విలువ కనిపిస్తోంది. చేతిలో ₹500 నోటు ఉన్నా టీ తాగేందుకు, కూరగాయలు కొనేందుకు, చిన్న చిన్న వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం చిన్న నోట్ల కొరత ప్రజలను, వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా "చిల్లర ఉందా..?" అన్న మాట వినిపిస్తోంది. ₹10, ₹20, ₹50 నోట్లు సరిపడా అందుబాటులో లేకపోవడంతో సాధారణ లావాదే వీలు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న చిల్లర చింతపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

- జిల్లావ్యాప్తంగా తీవ్రంగా చిల్లర కొరత
- ₹10 నోటు కోసం తిరుగుతున్న జనాలు
- ఇబ్బందుల్లో చిన్న వ్యాపారులు
- గ్రామీణ ప్రాంతాల్లో ముందుకు సాగని డిజిటల్ చెల్లింపులు
- బ్యాంకులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి



# 'చిల్లర' చింత..!

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 16, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు వంటి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం చిల్లర కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసే వారు రోజువారీ లావాదేవీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వ్యాపారం ప్రారంభించే ముందు చిల్లర కోసం బ్యాంకులు, పెట్రోల్ బంకులు, పెద్ద దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెల కొంటున్నాయి. కొన్ని చోట్ల వినియోగ దారులు చిల్లర లేక వస్తువులు కొన కుండా వెళ్లిపోతుండగా.. మరికొన్ని చోట్ల వ్యాపారులు సరుకు తగ్గించి ఇవ్వడం వంటి పరిస్థితులు కూడా కని పిస్తున్నాయి.

నగదు లావాదేవీలపైనే ఎక్కువగా ఆధారపడే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారు తోంది.

### ››› టీ తాగాలన్నా.. చిల్లర కోసం వెతుకులాట

రోడ్డు పక్కన టీ స్టాల్‌లో టీ తాగినా.. పానీపూరీ బండి వద్ద స్నాక్స్ తిన్నా.. కూరగాయలు కొనుగోలు చేసినా.. చివరికి డబ్బులు చెల్లించే సమయంలో చిల్లర సమస్య ప్రజలను వెంటాడుతోంది. వినియోగదారుల వద్ద పెద్ద నోట్లు ఉండగా.. వ్యాపారుల వద్ద చిన్న నోట్లు లేక ఇరువర్గాలు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ₹10 చిల్లర లేక టీ కూడా ఇవ్వలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. చిన్న మొత్తాల లావాదేవీలే ఎక్కువగా జరిగే దుకాణాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది.

### ››› చిన్న వ్యాపారులకు పెరుగుతున్న కష్టాలు

కూరగాయల వ్యాపారులు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్, పానీపూరీ బండ్లు, చిన్న కిరాణా దుకాణాలు ప్రస్తుతం ఈ చిల్లర సమస్యతో ఎక్కువగా ప్రభావిత మవుతున్నాయి. ఉదయం దుకాణాలు తెరవకముందే చిల్లర కోసం మరో దుకాణం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కొంత మంది వ్యాపారులు చిల్లర లేకపోవడంతో కస్టమర్లకు సరుకు తగ్గించి ఇవ్వడం, లేదా తర్వాత తీసుకెళ్లమని చెప్పడం వంటి పరిస్థితులు కూడా ఎదుర్కొంటున్నారు. దీంతో వినియోగదారులు, వ్యాపారుల మధ్య చిన్న చిన్న వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

### ››› గ్రామాల్లో ముందుకు సాగని డిజిటల్ చెల్లింపులు

పట్టణాల్లో ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ చెల్లింపులు విస్తృతంగా వినియోగంలోకి వచ్చినా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పటికీ అనేక చిన్న దుకాణాల్లో డిజిటల్ చెల్లింపుల సదుపాయం అందుబాటులో లేదు. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, మరికొన్ని చోట్ల స్మార్ట్‌ఫోన్ లేకపోవడం, డిజిటల్ పేమెంట్లపై అవగాహన తక్కువగా ఉండటం వల్ల నగదు లావాదేవీలపైనే ప్రజలు ఆధారపడుతున్నారు. దీంతో చిల్లర కొరత మరింత ప్రభావం చూపుతోంది.

### ››› చిరిగిన నోట్లతో మరో సమస్య

ప్రస్తుతం మార్కెట్లో తిరుగుతున్న ₹10 నోట్లు ఎక్కువగా చిరిగిపోయినవే కావడంతో వాటిని తీసుకోవడానికి చాలామంది వెనుకంజ వేస్తున్నారు. బ్యాంకుల్లో డిపాజిట్ అయిన చిన్న నోట్లు కూడా వినియోగదారులు తీసుకోవడానికి ఆసక్తి చూపకపోవడంతో మార్కెట్లో చిన్న నోట్ల కొరత పెరుగుతోంది.

### ››› బ్యాంకులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

మార్కెట్లో చిల్లర కొరతను దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ₹10, ₹20, ₹50 నోట్లు మరియు నాణేలను ఎక్కువగా అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటల్ ప్రపంచం ఎంత వేగంగా ముందుకు పరుగులు తీస్తున్నా.. సాధారణ ప్రజల జీవితాల్లో మాత్రం ఇప్పటికీ చిన్న నోట్లకే పెద్ద ప్రాధాన్యం ఉందని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

**సత్యనారాయణ, కూరగాయల వ్యాపారి**



"ఉదయం వ్యాపారం ప్రారంభించే ముందు చిల్లర కోసం తిరగాల్సి వస్తోంది. కొన్నిసార్లు కస్టమర్‌కు ఇవ్వడానికి ₹10 కూడా దొరకడం లేదు. వ్యాపారం కంటే చిల్లర టెన్షన్ ఎక్కువైంది."

**››› శ్రావణ్, టీ స్టాల్ నిర్వాహకుడు**



"టీ ధర ₹10. కానీ చాలామంది ₹500 నోటు ఇస్తున్నారు. చిల్లర లేకపోతే కస్టమర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజు మొత్తం ఇదే సమస్య."

**గంగాబాయ్, గ్రామీణ వినియోగదారురాలు**



"మా గ్రామంలో ఫోన్‌పే సరిగా పనిచేయదు. అందుకే నగదు తీసుకెళ్తాం. ఇప్పుడు చిల్లర దొరకక చిన్న కొనుగోళ్లు కూడా ఇబ్బందిగా మారాయి."

**››› నరేష్, స్థానిక వ్యాపారి**



"బ్యాంకులకు వెళ్తే కూడా చిన్న నోట్లు సరిపడా ఇవ్వడం లేదు. మార్కెట్లో చిల్లర కొరత రోజురోజుకీ పెరుగుతోంది. బ్యాంకులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి."

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

- - అబద్ధాల ప్రధాని నరేంద్ర మోడీ
- - సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి :
- ఎస్కే సాబీర్ పాషా

**మణుగూరు, మే 16 (ప్రజాజ్యోతి ):** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయం ఎదుట సిపిఐ పార్టీ నాయకులు ఎర్రజెండాలు చేతపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగినటువంటి ఐదు రాష్ట్రాల ఎన్నికలలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమని చిలక పలుకులు పలికి ఎలక్షన్లు అయిపోయిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే పెంచడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర




ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడకుండా పేద, మధ్యతరగతి ప్రజలపై పెను భారం మోపుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని, అబద్ధాల ప్రధాని నరేంద్ర మోడీ అని ఆరోపించారు. నరేంద్ర మోడీ మరల అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడిపై మోయలేని భారం మోపుతూ కార్పొరేట్ రంగాలకు కొమ్ముకాస్తున్నారు. దీంతో సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తూ ఈడి, సిబిఐ పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలు మార్చుకోవాలని, ఎన్నికల ముందు దేశ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేదంటే ప్రజా అగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా సమితి సభ్యులు మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు ఏఐటియూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై.రామ్ గోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సీనియర్ నాయకులు గడ్డం మనోహరా చారి, తోగటి కుమార్, ఎస్కే సర్వర్, తోట రమేష్, కామిశెట్టి రామారావు, ఎస్కె.సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, వేల్పుల నరేష్, ఎస్వీ.నాయుడు, పులిగల రమేష్, బాడిశ సతీష్, నోముల రవి, వజ్జా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.